సాక్షి నంద్యాల
గురువారం, 26, జూన్, 2025



ఆగకుండా.. ఆటంకం లేకుండా..
కర్నూలులో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది కొరత ఉంది. వాహనాలు నిలిచిపోతే సమస్య తలెత్తుతోంది. ఈ నేపథ్యంలో కర్నూలు ట్రాఫిక్ వాట్సప్ నంబర్ అందుబాటులోకి రానుంది. 8లో▸



ఘనంగా 'మట్టెద్దు'ల పండుగ
జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలు భక్తిశ్రద్ధలతో మట్టెద్దుల పండుగను జరుపుకున్నారు. మట్టి ఎద్దులకు ప్రత్యేక పూజలు చేసి పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,616.72
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:52.436
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:24,600
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:197

న్యూస్‌రీల్

మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా



మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

నంద్యాల: మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా అన్నారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈనెల 26న పాఠశాలలు, కళాశాలలో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఎక్సైజ్ అధికారులు రవికుమార్, రాముడు, డీఎం అండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, ఐసీడీఎస్ పీడీ లీలావతి, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

శిక్షణలో ఖాళీ కుర్చీలే ఎక్కువ



నంద్యాల(అర్బన్): స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో బుధవారం నిర్వహించిన నంద్యాల డివిజన్ స్థాయి మహిళా సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమంలో ఖాళీ కుర్చీలే ఎక్కువగా కనిపించాయి. పూర్తి స్థాయి అవగాహన కల్పించకపోవడంతో చాలా మంది గైర్హాజరయ్యారు. ఎంపీడీఓ సుగుణశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, డిప్యూటీ ఎంపీడీఓ రాధికారెడ్డి, రీసోర్స్ పర్సన్ దస్తగిరి బాషా పాల్గొన్నారు.

నట్టేట ముంచిన నకిలీ విత్తనాలు



నకిలీ విత్తనాల ప్యాకెట్ చూపుతున్న రైతు

ప్యాపిలి: రైతులు నకిలీ మొక్కజొన్న విత్తనాలతో నట్టేట మునిగారు. నష్టపోయిన వారిలో ప్యాపిలి మండలం జలదుర్గం గ్రామానికి చెందిన నాగేంద్ర, రామాంజనేయులు, కుమారస్వామి, కృష్ణారెడ్డి తదితర రైతులు ఉన్నారు. వీరు నెల రోజుల క్రితం డోన్ పట్టణంలోని ఓ ఫర్టిలైజర్స్ దుకాణంలో పీఏసీ 741 రకం మొక్క జొన్న విత్తనాలను ప్యాకెట్ రూ. 2 వేల ప్రకారం కొనుగోలు చేశారు. విత్తనాలు వేసి చేసి నెల రోజులు దాటినా ఇప్పటికీ మొలకలు సరిగా రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయమై ఫర్టిలైజర్స్ షాపు యజమానిని ప్రశ్నించగా తనకు సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నట్లు రైతులు తెలిపారు. ఈ విషయమై వ్యవసాయాధికారి రాజేశ్ వివరణ కోరగా సమస్య తమ దృష్టికి రాలేదన్నారు.

ఒప్పందానికి పొగ బెట్టి.. నట్టేట ముంచి!



- పొగాకు రైతులను నట్టేట ముంచిన కంపెనీలు
- మూడు నెలల్లో 45 శాతం మాత్రమే కొనుగోళ్లు
- బయ్యర్లు సిండికేట్‌తో లభించని గిట్టుబాటు ధర
- కార్యరూపం దాల్చని ప్రభుత్వ పెద్దల ప్రకటన

నంద్యాల(అర్బన్): పొగాకు సాగుపై పలు కంపెనీలు రైతులను ప్రోత్సహించాయి. దిగుబడి అంతా కొంటామంటూ ఆశ పెట్టాయి. చివరకు పంట చేతికొచ్చే సమయంలో అదిగో ఇదిగో అంటూ మోసం చేశాయి. నాణ్యత పేరుతో దగా చేస్తున్నాయి. అండగా నిలవాల్సిన ప్రభుత్వం, పొగాకు బోర్డు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను నట్టేట ముంచుతున్నాయి. ఓ వైపు పెట్టుబడి ఖర్చులు పెరగడం.. మరో వైపు మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో పొగాకు రైతు నిలువునా మోసపోయాడు. గత ఏడాది ఖరీఫ్ సాగు కింద జిల్లాలో 19 వేల హెక్టార్లలో పొగాకు సాగు చేశారు. దాదాపు 1,200 మంది రైతులు వివిధ కంపెనీలకు చెందిన పొగాకు పండించారు. హెక్టారుకు 31 బేళ్ల చొప్పున 19 వేల హెక్టార్లకు 5.89 లక్షల బేళ్లు సాగు చేసినట్లు సమాచారం. ఇప్పటి వరకు 45 శాతం మాత్రమే కొనుగోలు చేయగా మిగిలిన 55 శాతం కొనుగోలు చేయాల్సి ఉంది. ఎకరాకు 10 నుంచి 15 బేళ్ల దాకా దిగుబడి వచ్చింది. దిగుబడులు ఆశాజనకంగా వచ్చినా కొనుగోళ్ల సమయానికి బయ్యర్లు చేతులెత్తేయడంతో పొగాకు బేళ్లను ఇళ్ల వద్ద, ఏసీ గోడౌన్లలో ఉంచాల్సి వచ్చింది. జిల్లాలో 12 ప్రైవేట్ పొగాకు కంపెనీల ద్వారా ఇప్పటి వరకు కేవలం 35 మిలియన్ కేజీల పొగాకు కొనుగోళ్లు జరిగినట్లు సమాచారం. కంపెనీల ఒప్పందం చేసుకున్న సాగు విస్తీర్ణం కంటే దాదాపు 1,800 హెక్టార్లలో సాగు పెరిగింది. దీంతో కంపెనీలకు కొనుగోళ్లు భారంగా మారినట్లు తెలుస్తోంది. అలయన్స్‌వన్, జీపీఏ, ఐటీసీ, ఎంఎల్, వీఎస్టీటీ, తదితర కంపెనీల ద్వారా కొనుగోళ్లు జరిగాయి. ప్రస్తుతం ఎంఎల్, వీఎస్టీ కంపెనీలు కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేశాయి.

నిండిపోతున్న కోల్డ్ స్టోరేజీలు..
మార్చి నెలలో ప్రారంభమైన పొగాకు కొనుగోళ్లు ఇప్పటి వరకు 45 శాతం మాత్రమే పూర్తయ్యాయి. మార్కెట్‌లో ఆశించిన ధరలు రాకపోవడంతో రైతులు కొందరు తమ సరుకును తిరిగి కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తుండగా మరికొందరు ఇళ్ల వద్ద షెడ్లలో ఉంచుకొని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. జిల్లాలోని కోల్డ్ స్టోరేజీలు దాదాపు పొగాకు బేళ్లతో నిండిపోయాయి. సరుకును వేలం కేంద్రానికి తెచ్చి ధర రాక వెనక్కి తీసుకెళ్తుండటంతో రైతులపై అదనపు భారం పడుతోంది. అసలే ధర రాక అల్లాడుతుంటే ఇది తలకు మించిన భారంగా మారుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ధర నేల చూపు..
జిల్లా పరిధిలో గత ఏడాది క్వింటా గరిష్ట ధర రూ.28,000 పలుకగా ఈ ఏడాది వేలం నాలుగు నెలలు దాటుతున్నా ఇంత వరకు కనిష్ట ధరలకు మించలేదు. బయ్యర్లు సిండికేట్ గా మారి రైతుల వద్ద కొనుగోలు చేసిన వాటిలో పది శాతం బేళ్లకు గరిష్ట ధర ఇవ్వడం లేదు. చాలా ప్రాంతాల్లో సరాసరి ధర రూ.10,000 నుంచి రూ.13,000 కి మించడం లేదని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా నాణ్యత పేరుతో ధరలు తగ్గించేస్తుండటంతో పెంచిన బేళ్లను వెనక్కి తీసుకెళ్లలేక వచ్చిన ధరకు తెగనమ్ముకుంటున్నారు. గ్రేడ్ పేరుతో గరిష్ట ధర రూ.130కి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పది రోజుల వ్యవధిలో కేజీ మీద రూ.20 నుంచి రూ.30 వరకు తగ్గించేశారు. రోడ్లపై బైఠాయించి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో పొగాకు సాగు వివరాలు ఇలా..

పొగాకు సాగు విస్తీర్ణం: 19 వేల హెక్టార్లు	దిగుబడి: 5.89 లక్షల బేళ్లు

గడప దాటని దిగుబడి



ఇతని పేరు పుల్లయ్య. ఆళ్లగడ్డ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన సన్నకారు రైతు. నాలుగు ఎకరాల సొంతపొలంతో పాటు రెండు ఎకరాల కౌలు భూమిలో పొగాకు సాగు చేశాడు. అలయన్స్ ఓన్ కంపెనీకి చెందిన పొగాకు నాటాడు. ఒప్పందాలతోనే సాగు చేసిన పొగాకు కొనుగోళ్ల సమయానికి కంపెనీ చెతులెత్తేయడంతో తీవ్ర నిరాశకు గురయ్యాడు. ఇంటి వద్దనే తొక్కిన బేళ్లను ఉంచుకుని ఆశగా బేల చూపులు చూస్తున్నాడు.

దగా పడి నష్టపోయి



ఈయన పేరు ఏసన్న. మిడుతూరు మండలం వీపనగండ్ల గ్రామానికి చెందిన రైతు. ఐదు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని జీపీఐ కంపెనీకి చెందిన పొగాకు నాటాడు. 70 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తే ఇప్పటి వరకు కేవలం 18 క్వింటాళ్లు మాత్రమే ఆ కంపెనీ కొనుగోలు చేసింది. ఎకరాకు రూ. 1.20 లక్షల ప్రకారం ఐదెకరాలకు దాదాపు రూ. 6 లక్షల వరకు ఖర్చు పెట్టి సాగు చేశాడు. పంట చేతికొచ్చిన సమయంలో సరైన ధర లేకపోవడం, ఒప్పందం చేసుకున్న కంపెనీ మోసం చేయడంతో నట్టేట మునిగాడు.

మంత్రి హామీకి 20 రోజులు..
ఇటీవల టెక్కె మార్కెట్‌యార్డులో జరిగిన మినీ మహానాడు వేదికలో నాణ్యమైన పొగాకు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రకటించారు. అయితే రైతులు దిగుబడిని మొత్తం కొనుగోలు చేయాలని రోడ్డెక్కారు. ఆందోళనలు తీవ్రతరం చేశారు. ఆందోళనలకు స్పందించిన మంత్రి నాణ్యతను బట్టి పొగాకు కొనుగోలు జరిగేలా చర్యలు చేపడుతామని చెప్పారు. హామీ ఇచ్చి 20 రోజులు అవుతున్నా పొగాకు కొనుగోళ్లపై ప్రభుత్వం, అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళనకరమైన పరిస్థితుల్లో కొనుగోళ్ల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది.

దిగుబడి మొత్తం కొనుగోలు చేయాలి



ఎకరాకు రూ.1.50 లక్షలు వెచ్చించి మూడు ఎకరాల్లో పొగాకు సాగు చేశా. ఇప్పటి వరకు 12 బేళ్లు మాత్రమే కంపెనీలు కొనుగోలు చేశాయి. మిగిలిన 18 బేళ్లు ఇంటి వద్దనే ఉన్నాయి. సాగు చేసిన పొగాకును కొనుగోలు చేస్తామని మొదట కంపెనీలు హామీ ఇచ్చాయి. వారి సూచనలతోనే గత ఏడాది కంటే ఈ ఏడాది మరో ఎకరంలో అదనంగా సాగు చేశా. ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యం.
– మాబాషా, మహదేవపురం, శిరివెళ్ల మండలం

రైతులను ఆదుకోవాలి



జిల్లా రైతులు సాగు చేసిన పొగాకు మొత్తాన్ని మార్క్ ఫెడ్ ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేయాలి. రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయం. దాదాపు 2వేల ఎకరాల్లో సాగు అయిన కేఎస్‌సీ పొగాకును ఇంత వరకు అమ్మకాలు జరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి మొత్తం కొనుగోలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా రైతులతో ఉద్యమాలు చేపడతాం.– రామచంద్రుడు, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, నంద్యాల

వృద్ధ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న జడ్జి లీలా వెంకటశేషాద్రి

నంద్యాల(వ్యవసాయం): అనారోగ్యంతో బాధపడుతున్న ఖైదీలకు, అలాగే 70 ఏళ్ల పైబడిన వృద్ధ ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లీలా వెంకట శేషాద్రిలు తెలిపారు. నంద్యాలలోని జిల్లా ప్రత్యేక ఉపకారాగారాన్ని బుధవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో సమావేశం ఏర్పాటు చేశారు. లోక్ అదాలత్‌తో ఉచిత న్యాయం పొందవచ్చన్నారు. ఆన్‌లైన్ 15100 ద్వారా సేవలు అభ్యర్థించవచ్చని తెలిపారు. జైల్ సూపరింటెండెంట్ గురుప్రసాదరెడ్డి, న్యాయవాది నాయక్, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి సహాయ పరికరాల ఎంపిక శిబిరాలు

నంద్యాల(అర్బన్): జిల్లాలోని పలు మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణాల్లో ఈ నెల 26వ నుంచి జూలై 15వ తేదీ వరకు దివ్యాంగులు, వయో వృద్ధులకు సహాయ పరికరాల ఎంపిక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్‌లో, 28న నందికొట్కూరు ఎంపీడీఓ కార్యాలయం, జూలై 1న ఆళ్లగడ్డ ఎంపీడీఓ కార్యాలయం, 4న ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయం, 8న బనగానపల్లె ఎంపీడీఓ కార్యాలయం, 11న డోన్ ఎంపీడీఓ కార్యాలయం, 15న పాణ్యం ఎంపీడీఓ కార్యాలయాల్లో శిబిరాలు ఉంటాయని పేర్కొన్నారు. సదరం (40 శాతం తక్కువ కాకుండా), ఆధార్ కార్డు, బియ్యం కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం,(రూ.22,500 నెలకు), కుల పత్రం, వికలత్వం కనపడునట్లు మూడు ఫొటోలు,యుడీఐడీ కార్డులతో హాజరవ్వాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాతో కలిసి జిల్లా స్థాయి రహదారి భద్రతా సమన్వయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఏప్రిల్, రెండు నెలల్లో 98 రహదారి ప్రమాదాల జరగగా, అందులో 54 మంది మృతి చెందారన్నారు. ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్స్, సైన్ బోర్డ్స్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నూనెపల్లి నుంచి బొమ్మలసత్రం వెళ్లే దారిలో లైటింగ్ పెంచాలని చెప్పారు. ఆళ్లగడ్డ బైపాస్ ఎంట్రీ, ఎగ్జిట్ దారుల్లో ప్రమాదాలు జరగకుండా ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని, వాటి వద్ద సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది ఉండేలా చూడాలన్నారు. పట్టణంలో సీఎంఆర్ వస్త్ర దుకాణానికి సంబంధించి పార్కింగ్ స్థలం లేదని, టౌన్‌హాల్‌లో పార్కింగ్ చేసుకుని అందుకు తగిన రుసుంను మున్సిపల్ నిధిలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు అవసరమైన స్పీడ్ గన్స్ అందజేయాలని ఉన్నతాధికారులకు లేఖ సిద్ధం చేయాలన్నారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ.. హిట్ అండ్ రన్ 41 కేసులు నమోదు కాగా అందులో 29 కేసుల వివరాలు కలెక్టర్ కార్యాలయానికి పంపామన్నారు. నంద్యాల ఏఎస్పీ మందాజావళి ఆల్ఫోన్స్, ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్ రెడ్డి, నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, జిల్లా రవాణా అధికారి ఐశ్వర్య రెడ్డి, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, నేషనల్ ప్రాజెక్టు డైరెక్టర్లు, సంబంధిత శాఖ అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి పెరుగుతున్న వరద

శ్రీశైలం ప్రాజెక్ట్: కృష్ణానది పరీవాహక ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలానికి ఎగువన ఉన్న జూరాల, తుంగభద్ర ప్రాజెక్ట్‌ల నుంచి దిగువకు వరదనీరు ప్రవహిస్తోంది. మంగళవారం నుంచి బుధవారం వరకు 58,411 క్యూసెక్కుల వరదనీరు శ్రీశైలానికి వచ్చి చేరింది. డ్యాం పరిసర ప్రాంతాలలో 0.40 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 461 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కుడిగట్టు కేంద్రంలో స్వల్పంగా 0.075 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, ఉత్పాదన అనంతరం నాగార్జునసాగర్‌కు 143 క్యూసెక్కుల నీటిని విడిచి పెట్టారు. అలాగే బ్యాక్ వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు 318 క్యూసెక్కుల నీటని విడుదల చేశారు. బుధవారం సాయంత్రం సమయానికి శ్రీశైలం డ్యాం నీటిమట్టం 860.20 అడుగులకు చేరుకోగా, జలాశయంలో 106.6764 టిఎంసీల నీరు నిల్వ ఉంది.

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా శశికళారెడ్డి



నంద్యాల: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పీబీ శశికళారెడ్డి(నంద్యాల)ని నియమించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించిన పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో నంద్యాల జిల్లాలోని పలువురికి పదవులు దక్కాయి. బుధవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర పార్టీ కార్యాలయం నుండి వెలువడిన ప్రకటన మేరకు రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శులుగా ఎం.శివరామిరెడ్డి(బనగానపల్లె), ఎం.వెంకటేశ్వరరెడ్డి(డోన్), రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీగా డి.మధుసూదన్‌రెడ్డి(డోన్)ని నియమించారు.

ప్రాధాన్య భవనాలకు చంద్ర గ్రహణం

- గ్రామ సచివాలయాల నిర్మాణాలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- అందుబాటులోకి రాని హెల్త్‌క్లినిక్ భవనాలు
- నిర్మాణాలు పూర్తికాక ప్రజల అవస్థలు



పసురపాడులో ప్రారంభానికి నోచుకోని ప్రాధాన్యతా భవనాలు



పూర్తికాని సచివాలయి, రైతుభరోసా కేంద్ర భవనాలు

జిల్లాకు భవనాల మంజూరు	నిర్మాణం పూర్తయి వినియోగంలో ఉన్నవి	అసంపూర్తిగా నిలిచిపోయినవి	ఇప్పటి వరకు ప్రారంభం కానివి
1,077	644	369	64

గోస్పాడు: ప్రాధాన్యత భవనాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామస్థాయిలోనే సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. రేషన్‌తో సహా అన్ని సేవలు ఇంటి వద్దకే అందుబాటులోకి తీసుకొచ్చింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు మొదలుకొని అన్ని రకాల సేవలను గ్రామంలో అందించింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ప్రాధాన్యత భవనాలను వినియోగంలోకి తీసుకురాలేకపోతోంది.

ఏడాది అవుతున్నా..
నంద్యాల జిల్లాలో గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లన్నింటికీ కలిపి 1,077 భవనాలు మంజూరయ్యాయి. వాటిలో 644 భవనాలు ఆయా శాఖల అధికారులకు అప్పజెప్పారు. మొత్తం 369 భవనాల నిర్మాణాల వివిధ దశల్లో నిలిచిపోయాయి. వివిధ కారణాలతో మరో 64 భవనాల పనులు మొదలు కాలేదు. భవనాల నిర్మాణాలకు రూ.308.91 కోట్ల అంచనా కాగా అందులో రూ. 200 కోట్ల నిధులను అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ఇచ్చింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ. 15.45 కోట్లు విడుదల చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే పనులు పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కాలం ముగుస్తున్నా సచివాలయ, ఆర్బీకే, హెల్త్‌క్లినిక్ భవనాల నిర్మాణాలను పూర్తి చేయలేకపోయింది.

సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ..
కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామ సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. భవనాల పనులు ఎక్కడికక్కడ నిలిచినా వాటిని పట్టించుకోవడం లేదు. భవనాలు ప్రారంభం కాకపోవడంతో గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో గతంలో 411 సచివాలయ భవనాలు మంజూరు కాగా, 288 భవనాలు పూర్తి చేశారు. రూ. 164.31 కోట్లకు గాను రూ.121.78 కోట్లతో పూర్తి చేశారు. మిగిలిన113 భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. పది చోట్ల భవన నిర్మాణాలు ప్రారంభం కాలేదు.

ఇదీ దుస్థితి..
☛ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 393 రైతుభరోసా కేంద్రాలు మంజూరు కాగా 228 భవనాలు పూర్తి చేశారు. మిగిలిన 139 భవనాల పనులు ప్రారంభమైనా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అలాగే 26 భవనాలు ప్రారంభం కాకుండానే నిలిచిపోయాయి.
☛ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 273 హెల్త్ క్లినిక్‌లు మంజూరు కాగా రూ.52.94 కోట్లతో ప్రారంభించారు. మొత్తం 128 హెల్త్ క్లినిక్‌లకు రూ. 33.60 కోట్లు ఖర్చు చేసి పూర్తి చేశారు. వీటిలో 117భవనాలు వివిధ దశల్లో పనులు జరుగుతూ నిలిచిపోయాయి. అలాగే 28 భవనాల పనులు ప్రారంభం కాలేదు. నేటికీ పలు కారణాలతో నిర్మాణాలను పట్టించుకోని పరిస్థితి నెలకొంది. భవనాలు వివిధ దశల్లో నిర్మాణాలు చేపట్టేందుకు అప్పటి ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చుచేసినా ప్రస్తుత కూటమిప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి.

నిర్వీర్యం చేసే ప్రయత్నాలు
ఒక్కొక్క గ్రామ సచివాలయం ద్వారా దాదాపుగా 545 రకాల సేవలను అందించేలా అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతుభరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందించేవారు. 2019 ముందు వరకు వాటి కోసం మండల కేంద్రాలకు వెళ్తూ , రైతులు బారులు తీరడం, వేచిచూడాల్సిన పరిస్థితితో పాటు ఎన్నో వ్యయప్రయాసలు పడుతుండేవారు. వాటన్నింటికి రైతుభరోసా కేంద్రాల ద్వారా పరిష్కారం లభించింది. ధాన్యం కొనుగోలు కూడా రైతుభరోసా కేంద్రాల నుంచే నిర్వహించారు. గ్రామస్థాయిలోనే ప్రజలకు పనులు జరిగేలా చేసిన కార్యక్రమాలన్నింటినీ నిర్వీర్యం చేసే ప్రయత్నాలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

మెరుగైన సేవలు అందించాలి



గత ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండేలా గ్రామాల్లోనే సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసింది. పనుల నిమిత్తం ప్రజలు ఏ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా ఉండేది. అధికారులే గ్రామాలకు వచ్చి సేవలు అందించేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేకుండా పోతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఇబ్బందులు లేకుండా అధికారులు, ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.
– ఆర్థర్‌సైమాన్, ఎంపీపీ, గోస్పాడు

భవనాలను అందుబాటులోకి తేవాలి



సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్‌క్లినిక్‌లకు నూతన భవనాల ఏర్పాటుకు గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేసింది. అయితే ఆభవనాలు పూర్తయి ఏడాదికి పైగా కాలం గడుస్తున్నా వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉండే నూతన భవనాలు నిరుపయోగంగా మారుతున్నాయి.
– గద్దం ప్రసాద్‌యాదవ్, పసురపాడు

కర్నూలులో 30న ముస్లిం బహిరంగ సభ



పోస్టర్లు విడుదల చేస్తున్న ముస్లిం జేఏసీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఈనెల 30న కర్నూలు ఎస్టీబీసీ మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు నంద్యాల ముస్లిం జేఏసీ నాయకులు మౌలానా జాకీర్‌హుసేన్ తెలిపారు. నంద్యాలలోని డబరాల మసీదులో బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జాకీర్‌హుసేన్ మాట్లాడుతూ.. 'వక్ఫ్ బాచావో.. దస్తూర్ బచావో'అని కోరుతూ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ముస్లింలు అందరూ పాల్గొనాలని కోరారు. జేఏసీ నాయకులు మౌలానా అబ్దుల్లా రషాదీ, అబ్దుల్‌సమ్మద్, బాషా, ఇద్రూస్, ఎజాజ్, ఇబ్రహీం, హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆగకుండా.. ఆటంకం లేకుండా..!

- ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు కార్యాచరణ
- ప్రజల చేతిలో కర్నూలు ట్రాఫిక్ వాట్సాప్ నంబర్
- త్వరలో ప్రారంభించేందుకు పోలీసుల కసరత్తు



కర్నూలు: ట్రాఫిక్.. కర్నూలు నగరంలో ఇదో పరిష్కారం దొరకని సమస్య. సగటు జీవి సహనానికి పరీక్ష.. దీని పరిష్కారానికి కొన్నేళ్లుగా పోలీసు అధికారులు చేయని ప్రయత్నం.. ప్రయోగమంటూ లేదు. ప్రజలు, వాహనదారులే కాదు.. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఎదుర్కొంటున్న చికాకులు అన్నీ ఇన్నీ కావు. మళ్లీ ఇన్ని రోజులకు మరో కొత్త ఆలోచనతో పోలీసులు ముందుకొచ్చారు. ప్రజల చేతిలో కర్నూలు టాఫిక్ పేరుతో సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టనున్నారు.

అవస్థలు...

కర్నూలు మున్సిపాలిటీ స్థాయి నుంచి నగరపాలక సంస్థగా, కుడాగా రూపాంతరం చెందినప్పటికీ ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాలేదు. ఏడాదికేడాది వాహనాల సంఖ్య పెరగడం, రోడ్ల విస్తరణ లేకపోవడం, ఉన్నవి సైతం ఆక్రమణ వల్ల కుచించుకుపోవడం తదితర కారణాలతో నానాటికీ ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. దీనికి తోడు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఎక్కడైనా వాహనాలు జామ్ అయినా క్రమబద్ధీకరించేందుకు గంటలకొద్దీ సమయం పడుతోంది. వాహనాల నియంత్రణ, ఓవర్ లోడ్, రాంగ్ రూట్ ప్రయాణం, ఇతర ట్రాఫిక్ సమస్యల పరిష్కారంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తే బాగుంటుందని పోలీసులు ఆలోచించారు. ప్రజల చేతిలో కర్నూలు ట్రాఫిక్ వాట్సాప్ నంబర్ అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు జరుగుతోంది. త్వరలో ట్రాఫిక్ వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు.

ఫొటోలు తీసి గ్రూప్‌లో పోస్ట్ చేయాలి

కర్నూలు నగరం నలుదిక్కులా ఎక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తినా, వాహనాలు ఆగిపోయినా స్థానికులు ఫొటోలు తీసి వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేయాల్సి ఉంటుంది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితులను చక్కదిద్దుతారు. ట్రిపుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ పార్కింగ్, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపటం, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం, సీటు బెల్టు లేకుండా కారు నడపటం వంటి ఉల్లంఘనలపై ఫొటోలు తీసి వాట్సప్‌లో పోస్ట్ చేయవచ్చు. అలాగే వాహనాల చిత్రాలు, వీడియోలు కూడా తీసి షేర్ చేయవచ్చు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై ఫొటోలు, వీడియోల రూపంలో వాట్సప్‌కు షేర్ చేస్తే పోలీసులు వాటిపై విచారణ జరిపి నిర్ధారించుకుని వారికి జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ట్రాఫిక్ అధికారులు వెల్లడించారు.

గతంలో ట్రాఫిక్ నియంత్రణ పేరుతో వెబ్‌సైట్

కర్నూలు నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం గతంలో ట్రాఫిక్ మిత్ర పేరుతో వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అయితే అప్పటి ఎస్పీ సిద్ధార్థ కౌశల్ బదిలీపై వెళ్లడంతో ట్రాఫిక్ మిత్ర కార్యక్రమం అటకెక్కింది. కర్నూలు నగరంలో సుమారు ఆరు లక్షలకు పైగా జనాభా ఉంది. రోజురోజుకూ కాలనీలు విస్తరిస్తున్నాయి. వాహనాల సంఖ్య కూడా పెరుగుతోంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రధాన రహదారుల్లో సుమారు 36 పాయింట్లు ఉన్నాయి. ట్రాఫిక్ స్టేషన్‌లో ప్రస్తుతం 60 మంది మాత్రమే సేవలందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సిబ్బంది కొరత వేధిస్తున్న నేపథ్యంలో పౌరులను భాగస్వాములను చేసేందుకు పోలీస్ వాట్సప్ నంబర్‌ను అందుబాటులోకి తేనున్నారు.

నగర సమాచారం

- కర్నూలు నగర జనాభా సుమారు ఆరు లక్షలు
- ట్రాఫిక్ స్టేషన్‌కు అవసరమైన సిబ్బంది 100 మంది
- ప్రస్తుతమున్న సిబ్బంది 60 మంది
- నగరంలో ఉన్న ట్రాఫిక్ పాయింట్లు – 36
- ట్రాఫిక్ సిగ్నల్స్ – 13
- ద్విచక్ర వాహనాలు సుమారు 2 లక్షలు
- ఆటోలు 25 వేలకు పైగా
- కార్లు 50 వేలకు పైగా
- బస్సులు – 2 వేలు
- లారీలు, జీపులు – 2 లక్షలు
- ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలు, జిల్లాల నుంచి వచ్చి వెళ్లే అన్ని రకాల వాహనాలు సుమారు 2 లక్షలు

బీసీ హెచ్‌డబ్ల్యూఓస్ అసోసియేషన్ ఎన్నిక



జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రాజు



ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు

కర్నూలు(అర్బన్): జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. బుధవారం స్థానిక బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా పెద్దకడుబూరు వసతి గృహ సంక్షేమాధికారి పాలెగార్ సత్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శిగా పత్తికొండ కళాశాల బాలుర వసతి గృహం సంక్షేమాధికారి పి.శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్.ప్రమీల, కోశాధికారిగా కనకలత, ఉపాధ్యక్షులుగా సీ.శంకర్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.గిరిజాదేవి, సంయుక్త కార్యదర్శులుగా నరసప్ప, హారతీదేవి, ఎల్లమ్మ, కార్యవర్గ సభ్యులుగా గోపాల్, బసవరాజు, ప్రసన్నబాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. జిల్లాలోని బీసీ వసతి గృహాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా వసతి గృహ సంక్షేమాధికారులందరూ ఐకమత్యంగా విధులు నిర్వహించాలన్నారు. నూతన కార్యవర్గాన్ని సహచర వసతి గృహ సంక్షేమాధికారులు అభినందించారు.

క్లుప్తంగా

విద్యార్థిని చితకబాదిన పీడీ



పీడీ కొట్టిన దెబ్బలకు బాలుడి వీపుపై వాతలు తేలిన దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్: పట్టణంలోని వీవర్స్ కాలనీ జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థి సాయి అక్షయ్ అల్లరి చేశాడని ఫిజికల్ డైరెక్టర్ చితకబాదాడు. విద్యార్థి వీపుపై కొట్టడంతో వీపు ఎర్రగా కందిపోయింది. తలపై కొట్టడంతో గుడిపె కట్టింది. విద్యార్థి ఏడుస్తూ ఇంటికి వెళ్లటంతో తండ్రి నరేష్ అతన్ని వెంటబెట్టుకొని పాఠశాలకు వెళ్లి పీడీని ప్రశ్నించగా.. అల్లరి చేయడంతో కొట్టినట్లు నిర్లక్ష్యంగా సమాధానం చెపుతున్నాడని తండ్రి నరేష్ విలేకరుల వద్ద వాపోయారు. విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థిని బెత్తంతో కొట్టరాదనే నిబంధనలు ఉన్నా, ఇలా చితకబాదటం ఏమటని తండ్రి అంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పెద్దయ్య (ఫైల్)

మద్దికెర: గ్రామ శివారులోని మొలగవెల్లి రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గడ్డం పెద్దయ్య (40) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఉదయం మొలగవెల్లి రోడ్డులోని తన పొలంలో నిలిపిన జీవాలను చూసుకొని తిరిగి వస్తుండగా మద్దికెర నుంచి మొలగవెల్లికి వెళుతున్న కారు, స్కూటర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన పెద్దయ్యను చికిత్స కోసం గుంతకల్లుకు తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్‌నాయక్ కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టినట్లు వెల్లడించారు.

లింగనిర్ధారిత వీర్య నాళిక ధర తగ్గింపు

- పూర్తి ధర రూ.300.. సబ్సిడీ రూ.150

కర్నూలు(అగ్రికల్చర్): ఆవులు, గేదెల్లో పెయ్య దూడలే పుట్టడం ద్వారా పాడిని అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన లింగనిర్ధారిత వీర్య నాళికల ధరలను ప్రభుత్వం తగ్గించింది. గతంలో ఒక డోసు వీర్య నాళికల పూర్తి ధర రూ.1300 ఉండగా.. సబ్సిడీ రూ.850 ఉండేది. రైతులు రూ.500 చెల్లించాల్సి వచ్చేది. మొదటి డోసుకు చూలు కట్టకపోతే రెండవ డోసు ఉచితంగా వేసేవారు. తాజాగా ఒక డోసు వీర్య నాళికల పూర్తి ధరను రూ.300కు తగ్గించి 50 శాతం సబ్సిడీ ఇచ్చే విధంగా పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుంది. ఆవులు, గేదెలు ఎదకు వచ్చినపుడు రూ.150 చెల్లించి లింగనిర్ధారిత వీర్య నాళికలతో కృత్రిమ గర్భధారణ చేయించవచ్చు. మొదటి డోసుకు చూలు కట్టకపోతే రెండవ డోసు ఉచితంగా వేస్తారు. లింగ నిర్ధారిత వీర్య నాళికలతో కృత్రిమ గర్భధారణ చేయడం వల్ల 95 శాతం వరకు పెయ్య దూడలే పుడతాయని అధికారులు పేర్కొంటున్నారు.

మల్లన్న సేవలో మంచు విష్ణు



దర్శనం అనంతరం ఆలయం వద్ద సినీ హీరో మంచు విష్ణు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా, మల్లికార్జునస్వామి వార్లను సినీ హీరో మంచు విష్ణు బుధవారం దర్శించుకున్నారు. రాజగోపురం వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంచు విష్ణు మల్లికార్జున స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం చేయగా, అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం మంచు విష్ణు మాట్లాడుతూ.. శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివారిని దర్శించుకోవడంతో 12 జ్యోతిర్లింగాల యాత్ర పూర్తయ్యిందని చెప్పారు. తాను నటించిన కన్నప్ప సినిమా ఈ నెల 27న రిలీజ్ అవుతుందని, ప్రేక్షకులందరూ ఆదరించాలని కోరారు.

మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉండాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆదోని సబ్‌కలెక్టర్, డీఈఓ

ఆదోని సెంట్రల్: పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సూచించారు. పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు సరిపడా ఇవ్వడం లేదని ఫిర్యాదులు రావడంతో బుధవారం జిల్లా విద్యాధికారి శామ్యూల్‌పాల్, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణతో కలిసి పరిశీలించారు. భోజనం రుచికరంగా ఉంటుందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం తగినంత పెడుతున్నారా? తక్కువగా పెడుతున్నారా అని ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూశారు. మధ్యాహ్న భోజన పథకం రికార్డులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు తగినంత భోజనం వడ్డించాలన్నారు. రుచి, నాణ్యత లోపిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి, హెచ్‌ఎం ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

యాగంటి ఈఓగా పాండురంగారెడ్డి



కర్నూలు కల్చరల్: నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం యాగంటి ఉమా మహేశ్వర స్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈఓ)గా డి.పాండురంగారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయ శాఖ కమిషనర్ ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జ్యువెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ (జేవీఓ)గా విధులు నిర్వహిస్తున్న పాండురంగారెడ్డికి యాగంటి దేవస్థానం ఈఓగా విధులు నిర్వహిస్తున్న గ్రేడ్–2 ఈఓ బి.చంద్రుడు స్థానంలో ఎఫ్‌ఏసీ ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ పోరాటంతోనే జీఆర్‌పీ టెండర్లు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ పోరాటంతోనే ప్రభుత్వం గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం (జీఆర్‌పీ) పనులకు టెండర్లు పిలిచినట్లు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం లక్ష్మీనారాయణరెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టి సాగునీరు అందివ్వాలని కోరుతూ ఈ నెల 19న స్థానిక జీఆర్‌పీ కార్యాలయాన్ని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతులు ముట్టడించడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చిందన్నారు. ప్రాజెక్ట్ కింద ఎమ్మిగనూరు నియోజకవర్గంతో పాటు మంత్రాలయం నియోజకవర్గ పరిధిలోని ఎత్తిపోతల పథకం కింద 7 పనులను మొదలెట్టేందుకు ఈ నెల 21న టెండర్ ప్రక్రియను ప్రారంభించినట్లు వివరించారు. ఇందులో చిలకలడోన ఎత్తిపోతల పథకం–1కు రూ.16,75,250, రెండవ పథకానికి రూ.16,60,270, సోగనూరు పథకం –1కు రూ.16,68,360, రెండవ దానికి రూ.16,66,938, పూలచింత పథకం కింద ఒక పనికి రూ.16,68,360, రెండవ దానికి రూ.16,60,270 కేటాయించడం వివరించారు. జూలై 1న టెండర్లను ఓపెన్ చేసే అవకాశం ఉందని, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 6 నెలల్లో పనులను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి

గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకం పనులను వేగంగా పూర్తి చేయాలని గడ్డం లక్ష్మీనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన బుధవారం పట్టణంలో జీఆర్‌పీ ఆయకట్టు రైతులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. టెండర్లు పొందిన కాంట్రాక్టర్లు ముందుగా ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లకు 15 రోజుల్లో మరమ్మతులు చేయాలన్నారు. మిగతా జీఆర్‌పీ పనులను అధికారులు వెంటనే పూర్తి చేయించి సాగునీరందించాలని కోరారు. సర్పంచ్‌లు నరసింహులు, కోటేశ్వరరావు, ప్రకాష్‌రెడ్డి, పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు చాంద్‌బాషా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శాంతిరాజు, చుక్కామల్లేష్, వెంకటేష్, గోవిందు, ప్రభాకర్, సోమన్న, శివ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'మట్టెద్దు'ల పండుగ



చిన్నహ్యాటలో మట్టెద్దులకు పూజలు చేస్తున్న దృశ్యం

హొళగుంద: కర్ణాటక సంప్రదాయాలను పుణికిపుచ్చుకున్న హొళగుంద మండల ప్రజలు బుధవారం మట్టెద్దుల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇక్కడి ప్రజలు ఏటా ఏరువాక పౌర్ణమి తర్వాత వచ్చే అమవాస్య రోజున మట్టితో ఎద్దుల ప్రతిమలను తయారుచేసి పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా బుధవారం ఆయా గ్రామాల ప్రజలు మట్టి ఎద్దులకు ప్రత్యేక పూజలు చేసి పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. చిన్నహ్యాట గ్రామంలో సాయంత్రం కోలాటం, నృత్యాలతో మట్టి ఎద్దుల ఊరేగించి వైభవంగా నిమజ్జనం చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పొగాకు రైతు ఆత్మహత్యాయత్నం



గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రైతు రామకృష్ణ

నంద్యాల(న్యూటౌన్): పొగాకు కంపెనీల నిర్లక్ష్యం, ప్రభుత్వ అలసత్వం వల్లే పొగాకు రైతు ఆత్మహత్యకు ప్రయత్నించాడని, వెంటనే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా మిడ్తూరు మండలం చౌట్కూరుకు చెందిన పొగాకు రైతు మంగళి రామకృష్ణ (47) గుంటూరు రైల్వే స్టేషన్ సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించి అక్కడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. రామకృష్ణకు గ్రామంలో ఆరెకరాల పొలం ఉండగా ఆంజనేయ స్వామి ఆలయ భూమి 16 ఎకరాలను కౌలుకు తీసుకొని జీపీఐ, అలయన్స్ కంపెనీల ఒప్పందంతో పొగాకు పంటను సాగు చేసినట్లు తెలిపారు. పంట సాగు, పెట్టుబడి, కౌలు చెల్లించేందుకు రూ.30 లక్షల వరకు అప్పులు అయినట్లు చెప్పారు. ఈ స్థితిలో జీపీఐ, అలయన్స్ కంపెనీలు పొగాకును కొనుగోలు చేయకపోవడంతో వర్షాల వల్ల పొగాకు నాణ్యత దెబ్బతింటుందేమోనన్న భయంతో, అప్పులు ఇచ్చిన వాళ్లు ఒత్తిడి చేస్తుండటంతో ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు చెప్పారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి రైతుల నుంచి పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని, మోసం చేసిన పొగాకు కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బజారున పడిన వ్యవసాయశాఖ పరువు

- కొలిక్కిరాని ఏడీఏల బదిలీలు

కర్నూలు(అగ్రికల్చర్): గతంలో ఎప్పుడూ లేని విధంగా కూటమి ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ బదిలీల్లో రాజకీయం, పైరవీలు, ముడుపులదే పైచేయి కావడం గమనార్హం. బదిలీల ప్రక్రియ ఈ నెల 9తో ముగిసి.. బ్యాన్ వచ్చినప్పటికీ వ్యవసాయ శాఖలో సహాయ సంచాలకుల(ఏడీఏ) బదిలీల్లో గందరగోళం వీడని పరిస్థితి. ప్రభుత్వ పెద్దలు ఏడీఏల బదిలీల్లో నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తుండటం వల్లే పైరవీలు కొనసాగుతున్నాయి. దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీల ప్రక్రియ ముగిసిపోయింది. వ్యవసాయ శాఖలో మాత్రమే ఇప్పటికీ ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కారణంగా వ్యవసాయ శాఖలో పరిపాలన స్తంభించింది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ చురుగ్గా నడుస్తోంది. ఒకవైపు విత్తనాల పంపిణీ, మరోవైపు పొలం పిలుస్తోంది.. తదితర అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. బదిలీ కానున్న ఏడీఏలు ఈ కార్యక్రమాల పట్ల అంటీముట్టనట్లుగా ఉన్నారు. వ్యవసాయ శాఖలో ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఒక పోస్టులో ఇద్దరు, ముగ్గురిని నియమించడం, జోన్–4చెందిన ఏడీఏను జోన్–3కి బదిలీ చేయడం వంటి తప్పిదాలు భారీగా చోటుచేసుకున్నాయి. బదిలీ కోసం ఎలాంటి ఆప్షన్ ఇవ్వకపోయినప్పటికీ పైరవీలు, ముడుపుల కారణంగా బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి జిల్లాలో 13 మంది ఏడీఏలు బదిలీ అయ్యారు. ఈ నెల 10న బదిలీ ఉత్తర్వులు వెలువడిన తర్వాత పలువురు ఏడీఏలు మార్పులు, చేర్పుల కోసం ప్రభుత్వ పెద్దలను ఆశ్రయించడంతో కొద్ది గంటల్లోనే నిలిపేశారు. దీంతో మళ్లీ రాజకీయ సిఫారసులు, పైరవీలు, ముడుపుల వ్యవహారం ఊపందుకోవడంతో ఏడీఏల బదిలీల వ్యవహారం కొలిక్కిరాని పరిస్థితి. గతంలో ఎప్పుడూ లేని ఈ పరిస్థితి కారణంగా వ్యవసాయ శాఖ అభాసుపాలవుతోంది.

కదంబాల కనువిందు



మహానందిలో ఆకట్టుకుంటున్న కదంబ పుష్పాలు

మహానంది: బంతి వలె సుతిమెత్తగా, అందంగా కనిపించే కదంబ పుష్పాలు ప్రకృతి ప్రేమికులను, భక్తులను ఆకట్టుకుంటున్నాయి. మహానంది క్షేత్ర పరిసరాల్లో కదంబ వృక్షాలకు పుష్పాలు విరగకాస్తున్నాయి. ఈ పుష్పాలు పార్వతీదేవి, లలితాదేవికి ఇష్టమైనవని పురాణాల్లో పేర్కొన్నారు. ఇంతటి ప్రాచుర్యం కలిగిన కదంబ పుష్పాలను చూసి భక్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులైతే ఎంత బాగున్నాయో అంటూ వాటి గురించి తెలుసుకుని మరీ ఇళ్లకు తీసుకెళ్తున్నారు.

ఏపీ ఏఐయూకేఎస్ అధ్యక్షుడిగా అర్లప్ప



నందికొట్కూరు: ఆంధ్రప్రదేశ్ అఖిలభారత ఐక్య రైతు సంఘం అధ్యక్షుడిగా వేల్పుల అర్లప్పను ఏకగ్రీవంగా ఎన్నుకునట్లు సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. జంగారెడ్డి గూడెంలో రోటరీ క్లబ్‌లో జరిగిన అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రథమ మహాసభలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వేల్పుల అర్లప్ప మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రాష్ట్ర బాధ్యతలు అప్పగించడంతో రైతు సమస్యలపై నిరంతరం కృషి చేస్తానన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల రైతుల పక్షాన నిలబడి పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.



ఖాళీగా దర్శనమిస్తున్న మద్దికెర గ్రామ సచివాలయం – 1

సచివాలయం ఖాళీ !

మద్దికెర: కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ స్థాయిలోనే ప్రజలకు ప్రభుత్వ సేవలందించాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించింది. కార్యకలాపాలు సాఫీగా సాగాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ వస్తోంది. ఈ క్రమంలో స్థానిక ఒకటవ సచివాలయంలోని ఫర్నిచర్ ఇతర కార్యాలయానికి తరలించడంతో ఖాళీగా ఇలా దర్శనమిస్తోంది. కూర్చోవడానికి కుర్చీలు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఎవరూ లేరని వెనుదిరిగిపోతున్నారు. ఇదే సచివాలయంలో ఆధార్ సేవల కేంద్రం నిర్వహిస్తుండడంతో వచ్చిన వారు అవస్థలు పడుతున్నారు. ఒక కార్యాలయంలోని ఫర్నిచర్ మరో కార్యాలయానికి ఎలా తరలిస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

డబ్బులెప్పుడు ఇస్తారు సారూ..?



మూసి ఉన్న ఎన్టీఆర్ వైద్యసేవ నగదు ఇచ్చే కౌంటర్

సార్.. మేము రోజూ తిరుగుతున్నాం.. ఆసుపత్రిలో ఇవ్వాల్సిన దానికంటే చార్జీలకే ఎక్కువ ఖర్చయ్యాయి. మాకు డబ్బులు ఎప్పుడు ఇస్తారు సార్. అంటూ ఎన్టీఆర్ వైద్యసేవ కింద చికిత్స పొందిన రోగులు ప్రాధేయపడుతున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఎన్టీఆర్ వైద్యసేవ కింద చికిత్స పొందిన రోగులు వైద్య పరీక్షలు, మందుల కోసం పెట్టుకున్న ఖర్చులను డిశ్చార్జ్ అనంతరం అధికారులు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆసుపత్రిలోని పేయింగ్ బ్లాక్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. డిశ్చార్జ్ అయిన రోగులు సంబంధిత బిల్లులు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులను అక్కడ అందజేస్తే ఖర్చు చేసిన మొత్తంలో కొంత తిరిగి ఇస్తారు. అయితే కొన్ని రోజులుగా ఈ కౌంటర్ తెరవడం మానేశారు. దీంతో ఆ కౌంటర్ పక్కనే ఉన్న ఎన్టీఆర్ వైద్యసేవ కార్యాలయంలో వారు డబ్బుల కోసం ఆరా తీస్తున్నారు. సార్ మాకు డబ్బులు ఎప్పుడిస్తారని వారిని అడుగుతుంటే మాకు సంబంధం లేదని, ఆసుపత్రి అధికారులను కలవాలని చెప్పి పంపిస్తున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)

పట్టాలు దాటుతుండగా ఢీకొట్టిన రైలు

- పాలిటెక్నిక్ విద్యార్థి దుర్మరణం



మృతుడి ఐడీ కార్డు

ఆదోని సెంట్రల్: ఆదోనిలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో విద్యార్థి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని మదిరె గ్రామానికి చెందిన విశ్వనాథ్, సావిత్రి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు నితిన్ బిట్స్ కళాశాలలో పాలిటెక్నిక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. రోజు మాదిరిగానే ఉదయం కళాశాలకు బయలుదేరాడు. పట్టణంలోని నల్లగేటు వద్ద కి.మీ. నంబర్ 495/33–31 వద్ద ట్రాకు దాటుతుండగా రైలు ఢీకొని తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.